క్లుప్తంగా

డెల్టా కాలువలకు నీటి విడుదల తగ్గింపు

నిడదవోలు: వారం రోజులుగా ఎడతెరపి లేకుండా వర్షాలు కురుస్తుండడంతో జిల్లాల్లోని డెల్టా రైతుల వ్యవసాయ అవసరాల మేరకు నీటి విడుదలను అధికారులు క్రమబద్ధీకరిస్తున్నారు. ధవళేశ్వరం నీటి పారుదల శాఖ హెడ్ వర్క్స్ అధికారులు డెల్టా కాలువలకు నీటి విడుదలను తగ్గించారు. సోమవారం పశ్చిమ డెల్టాకు 5,500, మధ్య డెల్టాకు 2800, తూర్పు డెల్టాకు 4000 క్యూసెక్కుల చొప్పున నీటిని విడుదల చేస్తున్నారు. పశ్చిమ డెల్టా పరిధిలో ఏలూరు కాలువకు 940, తణుకు కాలువకు 736, అత్తిలి కాలువకు 576, నరసాపురం కాలువకు 1808 క్యూసెక్కుల చొప్పున నీటిని విడుదల చేస్తున్నారు.

గరప కాలువ పూడికతీత ప్రారంభం



పెరవలిలో గరప కాలువను తవ్వుతున్న పొక్లెయిన్

పెరవలి: నిడదవోలు ఎమ్మెల్యే జి.శ్రీనివాస్‌నాయుడి ఆదేశాల మేరకు మండలంలోని గరప కాలువ పూడికతీత పనులను సోమవారం యుద్ధప్రాతిపదికన చేపట్టారు. ఈ కాలువ ఆయకట్టు భూములకు పుష్కలంగా నీరు అందడం లేదు. దాంతో రైతుల విజ్ఞప్తి మేరకు అధికారులు ఈ చర్యలకు ఉపక్రమించారారు. మండలంలోని కాకరపర్రులో ప్రారంభమై ఇరగవరం మండలంలోని తూర్పు విప్పర్రు వరకూ గరప కాలువ ప్రవహిస్తుంది. పెరవలి నుంచి ఈ కాలువ పలుచోట్ల పూడుకుపోయింది. ఈ విషయాన్ని ఆయకట్టు రైతులు శనివారం కొత్తపల్లి అగ్రహారంలో నిర్వహించిన గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే శ్రీనివాస్‌నాయుడి దృష్టికి తీసుకువెళ్లారు. దాంతో ఆయన వెంటనే స్పందించి వెంటనే పూడిక తీయించాలని ఇరిగేషన్ ఏఈకి ఆదేశాలిచ్చారు. పూడక తీత పనులను రైతులు దగ్గర ఉండి పర్యవేక్షించారు. ఈ కాలువపై కొత్తపల్లి అగ్రహారం, కాపవరం గ్రామాల పరిధిలో సుమారు ఐదు వేల ఎకరాలు సాగవుతోంది. ఈ గ్రామాల రైతుల సాగునీటి కష్టాలు తీరనున్నాయి.

నందిగంపాడులో ఫ్యామిలీ డాక్టర్

చాగల్లు: మండలంలోని నందిగంపాడులో సోమవారం ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమం నిర్వహించారు బ్రాహ్మణగూడెం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం డాక్టర్ పీఆర్ఎల్ దేవి 78 మందికి వైద్య పరీక్షలు చేశారు. అలాగే గర్భిణులు, బాలింతలు, బీపీ, షుగర్ వ్యాధిగ్రస్తులకు పరీక్షలు నిర్వహించి, అవసరమైన వారికి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో 104 వైద్య సిబ్బంది, ఎంఎల్‌హెచ్‌పీ కె.అనూష, ఏఎన్ఎం ఎం. బేబీ, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

శివాలయంలో విశేష పూజలు

కొవ్వూరు: స్థానిక శ్రీనివాస ఘాట్‌లోని ప్రకృతి మల్లికార్జున రావణబ్రహ్మ శివాలయంలో సోమవారం విశేష పూజలు, అభిషేకాలు నిర్వహించారు.రాజాన అప్పారావు, చిన్నారి దంపతులు ఆలయం వద్ద అన్నదానం చేశారు. పలువురు స్థానిక భక్తులు పూజల్లో పాల్గొన్నారు.శివ భక్త రావణ బ్రహ్మ చారిటబుల్ ట్రస్టు చైర్మన్ అనపర్తి శివుడు, మద్దుకూరి నాగసాయి తదితరులు హాజరయ్యారు.

29న ఏపీ సీపీఎస్ జిల్లా కార్యవర్గ సమావేశం

తాళ్ళపూడి: ఆంధ్రప్రదేశ్ సీపీఎస్ నూతన జిల్లా కార్యవర్గ ఎన్నిక సమావేశాన్ని ఈ నెల 29న రాజమహేంద్రవరంలోని ఎన్జీవో హోమ్‌లో నిర్వహించనున్నట్టు ఆ సంఘ ప్రధాన కార్యదర్శి, ఉమ్మడి పశ్చిమగోదావరి నాయకుడు జోడాల వెంకటేశ్వరరావు సోమవారం తెలిపారు. ఉదయం 10 గంటలకు ఈ సమావేశం ప్రారంభం అవుతుందన్నారు. ఆసక్తి, నాయకత్వ లక్షణాలు గల సీపీఎస్ ఉద్యోగులు ఈ సమావేశానికి విధిగా హాజరు కావాలని కోరారు.



పెరవలి మండలం ఖండవల్లిలో నీట మునిగిన కంద తోట



కాకరపర్రులో లంక నుంచి పడవపై తెచ్చిన అరటి గెలలను ఏటిగట్టుకు చేరుస్తున్న కూలీలు



నీట మునిగిన పెరవలి మండలంలోని తీపర్రు గ్రామంలోని పుష్కరాల రేవు

లంకలను చుట్టుముట్టిన వరద

- నాలుగు రోజులుగా ఇదే పరిస్థితి
- నీటిలో 800 ఎకరాల్లోని పంటలు
- ఆందోళన చెందుతున్న అన్నదాతలు

పెరవలి: జూలై.. ఆగస్టు నెలలంటే గోదావరికి వరదల సీజన్. తమ పంటలు ముంపు బారిన పడకుండా కాపాడాలంటూ లంక గ్రామాల రైతులు దేవుడ్ని వేడుకోని రోజు లేదు. వారి మొరను భగవంతుడు మన్నించినట్టు లేదు. నాలుగు రోజులుగా వశిష్ట గోదావరికి వరద పోటెత్తింది. మండలంలోని దిగువ లంకల్లోని సుమారు 800 ఎకరాల్లో సాగవుతున్న వివిధ రకాల పంటలు నీట మునిగాయి. పశువులకు గూడు కరవైంది. కానూరు, కానూరు అగ్రహారం, ఉసులుమర్రు, తీపర్రు, కాకరపర్రు, ఉమ్మిడివారిపాలెం, ఓదూరివారిపాలెం, ముత్యాలవారిపాలెం, ముక్కామల, లంకమాలపల్లి, ఖండవల్లి, మల్లేశ్వరం గ్రామాల లంక భూముల రైతులకు దిక్కుతోచని పరిస్థితి ఎదురైంది. ఈ లంకల్లో సాగవుతున్న కొబ్బరి, అరటి, కంద, కోకో, తమలపాకులు, కూరగాయల పంటలైన వంగ, బెండ, బీర, ఆనబ, చిక్కుడు, క్యాబేజీ, దొండ, పచ్చిమిర్చి, ఆకు కూరలైన గోంగూర, తోటకూర, పాలకూర, చుక్కకూర, మెంతికూర వంటి పంటలు నీట మునిగాయి. వాటితో పాటు బంతి, చామంతి, గులాబీ, మల్లె, లిల్లీ తోటలు దెబ్బతిన్నాయి. లంక రైతులు గగ్గోలు పెడుతున్నారు. ఆశ చావని రైతులు ప్రాణాలకు తెగించి, శ్రమకోర్చి పడవలపై లంకల్లోకి వెళ్లి అరటి గెలలను కోసి తెచ్చుకుంటున్నారు. రూ.వేలల్లో పెట్టుబడి పెట్టి తీతకు సిద్ధంగా ఉన్న కంద పంట ఎక్కడ దక్కకుండా పోతుందోనని కంద రైతులు ఆందోళన చెందుతున్నారు. లంకల్లోని పశువుల పాకలు, పచ్చిక బయళ్లు కూడా నీట మునిగాయి. దాంతో గట్లపైనే సేద తీరుతున్నాయి. వరద మరింత పెరిగితే ఏం జరుగుతుందోనని రైతులు ఆందోళన చెందుతున్నారు. గతేడాది జూలైలో రెండు సార్లు గోదావరి ఉగ్ర రూపం దాల్చడంతో లంక పంటలు పూర్తిగా పాడైపోయి రైతులు తీవ్రంగా నష్టపోయారు.



లంకమాలపల్లి ఏటుగట్టుపై గేదెలను కడుతున్న రైతులు

ఏటుగట్టుపై పహరా

వరద గోదావరిలోకి ఎవరూ దిగకుండా ఏటిగట్లపై పోలీసులు పహరా కాస్తున్నారు. కానూరు అగ్రహారం, ఉసులుమర్రు, తీపర్రు, కాకరపర్రు, ముక్కామల, ఖండవల్లి, మల్లేశ్వరం, కడింపాడు గ్రామాల పుష్కరాల రేవుల వద్ద ఈ పహరా కొనసాగుతోంది. పెరవలి ఎస్ఐ యం.సూర్య భగవాన్ మంగళవారం ఆయా ప్రాంతాలను పరిశీలించి అప్రమత్తంగా ఉండాలని సిబ్బందిని ఆదేశించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలో 18 కిలోమీటర్ల మేర విస్తరించి ఉన్న గోదావరి పరీవాహక ప్రాంతంలో ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా ముందస్తు పహరా కాస్తున్నామని తెలిపారు. ఆయా గ్రామాల రెవెన్యూ సిబ్బంది కూడా పాల్గొన్నారు.



నిడదవోలు పట్టణంలో కురుస్తున్న వర్షానికి గొడుగులతో ఇలా..

చినుకులతో చిరు వ్యాపారుల ఇక్కట్లు

నిడదవోలు: బంగాళాఖాతంలో ఏర్పడిన ఆవర్తన ద్రోణి ప్రభావంతో కొద్ది రోజులుగా ముసురు పట్టింది. నిడదవోలు పరిసర ప్రాంతాల్లో కరుస్తున్న వర్షానికి పౌర జీవనానికి కొంతమేర అంతరాయం కలిగింది. పల్లపు ప్రాంతాలు నీట మునగడంతో రాకపోకలకు ప్రజలు ఇబ్బందులు పడ్డారు.పట్టణంలో ఫుట్‌పాత్‌ల వద్ద తోపుడు బండ్లతో వ్యాపారాలు చేసుకునే చిరు వ్యాపారులకు బేరాలు లేక ఇబ్బందులు పడ్డారు. మరో పక్క నియోజకవర్గంలోని డెల్టా, మెట్ట ప్రాంతాల్లో ఖరీఫ్ వరినాట్లు జోరుగా సాగుతన్నాయి. ఇప్పటికే 90 శాతం వరినాట్లు పూర్తయ్యాయని వ్యవసాయాధికారలు చెబుతున్నారు. ప్రస్తుతం కరుస్తున్న వర్షాలు రైతులకు మేలుచేస్తాయంటున్నారు.

వేకువజాము నుంచి..

నిడదవోలు రూరల్: సోమవారం వేకువజాము నుంచీ మండల వ్యాప్తంగా ఎడతెరిపి లేకుండా సన్నపాటి వర్షం కురిసింది. వారం రోజులుగా అడపాదడపా వర్షాలు కురుస్తుండడంతో రైతులు దాదాపుగా ఖరీఫ్ వరినాట్లు పూర్తి చేశారు. సమిశ్రగూడెం, డి.ముప్పవరం, విజ్జేశ్వరం గ్రామాల్లోని పల్లపు ప్రాంతాలు పూర్తిగా జలమయం అయ్యాయి. మురుగు నిల్వ ఉండకుండా పంచాయతీ సిబ్బంది చర్యలు చేపట్టారు.

గోపాలపురం: ఎడతెరిపి లేకుండా వర్షం కురుస్తుండడంతో ప్రజలు నానా అవస్థలు పడుతున్నారు. సోమవారం తెల్లవారుజాము నుంచి ఏకధాటిగా కురుస్తున్న వర్షానికి ఇంటి నుంచి బయటకు వెళ్లడానికి ప్రజలు ఇబ్బందులు పడ్డారు. ఇంటికే పరిమితం కావాల్సి వచ్చింది. వర్షం వల్ల ఉపాధి కూలీలు, హమాలీలు, చిరు వ్యాపారులు, ఉద్యోగస్తులు ఇబ్బందులకు గురయ్యారు.

పొంగి పొర్లుతున్న చెరువులు

దేవరపల్లి: నాలుగు రోజులుగా విస్తారంగా వర్షాలు కురుస్తున్నాయి. వర్షాలకు చెరువుల్లో నీరు చేరడంతో వ్యవసాయ పనులు జోరుగా సాగుతున్నాయి. తాడిపూడి కాలువకు నీటిని విడదల చేశారు. మరోపక్క వర్షాలు కురుస్తుండడంతో రైతులు, కూలీలతో పొలాలు కళకళలాడుతున్నాయి. చెరువు ఆయకట్టు రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. దేవరపల్లి మండలంలోని యర్నగూడెం గండి చెరువు నీటితో నిండుకుండలా మారింది. అరటి, కొబ్బరి, కోకో, పామాయిల్, జీడిమామిడి, మామిడి వంటి ఉద్యాన పంటలకు ఈ వర్షాలు మేలు చేశాయని రైతులు తెలిపారు.

ఉండ్రాజవరం: మండలంలో సోమవారం చెదురు మదురు వర్షం పడింది. దాంతో పాఠశాలలకు వెళ్లే విద్యార్థులు, చిరు వ్యాపారులు, ప్రయాణికులు ఇబ్బందులు పడ్డారు. ఈ వర్షం వరి, వాణిజ్య పంటలకు మేలు చేస్తుందని రైతులు చెబుతున్నారు. మరోపక్క రైతులు వ్యవసాయ పనులు ముమ్మరం చేశారు. మండలంలో వరి నాట్లు చివరి దశకు చేరుకున్నాయి.



వర్షాలకు పొంగి ప్రవహిస్తున్న దేవరపల్లి మండలం యర్నగూడెంలోని గండి చెరువు

అభివృద్ధిని కేసులతో అడ్డుకుంటారా?

- నిడదవోలు ఎమ్మెల్యే శ్రీనివాస్‌నాయుడు ధ్వజం
- ముక్కామల గ్రామంలో శంకుస్థాపన, ప్రారంభోత్సవం
- గడప గడపకూ మన ప్రభుత్వం

పెరవలి: పల్లెల అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం రూ.కోట్లు ఖర్చు చేస్తుంటే, అభివృద్ధిని అడ్డుకోవడానికి విపక్షాలు కోర్టులో కేసులు వేస్తున్నాయని నిడదవోలు ఎమ్మెల్యే జి శ్రీనివాస్ నాయుడు విమర్శించారు. మండలంలోని ముక్కామల గ్రామంలో సోమవారం మధ్యాహ్నం ఆయన గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. జల్‌జీవన్ మిషన్ ద్వారా రూ.90 లక్షల వ్యయంతో ఆ గ్రామంలో నిర్మించే వాటర్ ట్యాంక్‌కు శంకుస్థాపన చేశారు. ముక్కామల ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన డిజిటల్ స్క్రీన్‌ను ప్రారంభించారు. కార్యక్రమాల్లో ఎమ్మెల్యే మాట్లాడుతూ నియోజకవర్గంలో జరుగుతున్న అభివృద్ధికి ఏ పార్టీవారు అడ్డొచ్చినా సహించేది లేదన్నారు. అనేక అభివృద్ధి పనులు, వివిధ సంక్షేమ పథకాల ద్వారా ముక్కామల ప్రజలకు రూ.20 కోట్ల మేర లబ్ధి చేకూరిందన్నారు. నియోజకవర్గంలో తాను రాజకీయాలు చేయబోనని, కేవలం అభివృద్ధి చేయడానికే వచ్చానని ఆయనన్నారు. సొంతిల్లు లేని పేదవాడు ఈ ప్రభుత్వం లక్ష్యమన్నారు. రాష్ట్రంలో టీడీపీ అధికారంలో ఉండగా పేదలకు సెంటు భూమి ఇచ్చిందా? అని ఎమ్మెల్యే ప్రశ్నించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ దామోదరరావు, వివిధ శాఖల అధికారులు, ఎంపీపీ కార్చెర్ల ప్రసాద్, వైఎస్సార్ సీపీ మండల శాఖ అధ్యక్షుడు వీరమళ్ళ సత్యనారాయణ, సర్పంచ్ కేతా త్రిమూర్తులు ఎంపీటీసీ సభ్యులు గండేపల్లి రామకృష్ణ, వేండ్ర శ్రీను, సొసైటీ అధ్యక్షుడు రేలంగి ఏసు, పార్టీ గ్రామశాఖ అధ్యక్షుడు నందిగం వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.



ముక్కామలలో వాటర్ ట్యాంక్‌కు శంకుస్థాపన చేసిన ఎమ్మెల్యే శ్రీనివాస్ నాయుడు

ఆచూకీ లేని ఓటర్లను తొలగించండి

అధికారుల సమీక్షలో ఆర్డీవో మల్లిబాబు ఆదేశం

కొవ్వూరు: ఓటరు సర్వేలో పక్కా సమాచారాన్ని నమోదు చేసి తప్పులు లేని జాబితాను రూపొందించాలని నియోజకవర్గ ఎన్నికల అధికారి, ఆర్డీవో ఎస్.మల్లిబాబు సూచించారు. ఓటరు సర్వే సూపర్‌వైజర్లు, ఎన్నికల విభాగం సిబ్బందితో సోమవారం ఆర్డీవో కార్యాలయంలో ఆయన సమీక్ష జరిపారు. ఓట్ల తొలగింపు, చేర్పులు, మార్పులను ఎన్నికల సంఘ మార్గదర్శకాల మేరకు చేయాలని ఆర్డీవో అన్నారు. ఈనెల 21 నుంచి బూత్ లెవెల్ అధికారులు ఇంటింటి సర్వే చేపట్టిన విషయం తెలిసిందే. ఈ సర్వేలో నమోదు చేసిన వివరాలను మండలాల వారీగా మల్లిబాబు సమీక్షించారు. సర్వే సిబ్బందికి క్షేత్ర స్థాయిలో ఎదురవుతున్న ఇబ్బందులను అడిగి తెలుసుకున్నారు. విదేశాల్లో ఉంటున్న వారి, వలస వెళ్లి కొన్నేళ్లుగా అందుబాటులో లేని వారి, క్షేత్ర స్థాయిలో ఎలాంటి సమాచారం తెలియని వారి ఓట్లను ఫారం-7 ద్వారా రద్దు చేయాలని ఆదేశించారు. సర్వే ద్వారా నియోజకవర్గంలో ఇప్పటివరకూ 163 మంది స్పష్టత లేని, ఇంటి నంబర్లు లేని ఓటర్లను గుర్తించామన్నారు. వారిలో ఇప్పటికే 160 మంది ఓటర్ల వివరాలను సరి చేయించినట్లు ఆర్డీవో ప్రకటించారు. తహసీల్దార్ బి.నాగరాజు నాయక్, ఈవోపీఆర్ అండ్ ఆర్డీ శర్మ, ఎంపీడీవో కార్యాలయ ఏవో కె.ప్రసన్నకుమార్, గృహ నిర్మాణ శాఖ రూరల్ ఏఈ చక్రవర్తి తదితరులు పాల్గొన్నారు.



సమీక్షలో మాట్లాడుతున్న ఆర్డీవో మల్లిబాబు

సురక్షలో ధ్రువపత్రాల పంపిణీ

నల్లజర్ల: మండలంలోని ఘంటావారిగూడెంలో సోమవారం జగనన్న సురక్ష కార్యక్రమం నిర్వహించారు. సర్పంచ్ రాజులపాటి సుభాషిణి అధ్యక్షత నిర్వహించిన ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఎమ్మెల్యే తలారి వెంకట్రావు 1007 మంది లబ్ధిదారులకు వివిధ రకాల ధ్రువీకరణ పత్రాలు అందజేశారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ గగ్గర శ్రీనివాస్, సొసైటీ అధ్యక్షుడు కారుమంచి రమేష్, నాయకులు తొమ్మండ్రు రమేష్, ఇమ్మణ్ణి సత్తిపండు, ఈలప్రోలు చంద్రరావు, మటపర్తి రామకృష్ణ, జువ్వలపాలెపు అన్నవరం పాల్గొన్నారు.

చాగల్లు: ఊనగట్ల, మీనానగరం గ్రామాల్లో సర్పంచులు మట్టా వెంకట్రావు, ఉన్నమట్ల మనశ్శాంతి అధ్యక్షతన జగనన్న సురక్ష గ్రామసభలు నిర్వహించారు. ఎంపీపీ మట్టా వీరాస్వామి, వైఎస్సార్ సీపీ రైతు విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆత్కూరి దొరయ్య ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఊనగట్ల సచివాలయంలో 980 మంది, చాగల్లు-5 సచివాలయంలో 878 మంది లబ్ధిదారులకు ఇంటి స్థలాల పట్టాలు, ధ్రువీకరణ పత్రాలు, రేషన్ కార్డులను వారిద్దరి చేతుల మీదుగా అందజేశారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ మండల శాఖ అధ్యక్షుడు చెల్లింకుల దుర్గామల్లేశ్వరరావు, పార్టీ నాయకులు మేకా రాజు, కంకటాల శ్రీనివాస్, బొర్రా రజనీప్రసాద్, ఎంపీడీవో బి.రాంప్రసాద్, తహసీల్దార్ కె.రాజ్యలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.



ఘంటావారిగూడెంలో లబ్ధిదారులకు ధ్రువపత్రాలు అందిస్తున్న ఎమ్మెల్యే తలారి వెంకట్రావు

తాళ్ళపూడి: మండలంలోని తిరుగుడుమెట్ట గ్రామంలో సర్పంచ్ వల్లభశెట్టి గంగాభవాని అధ్యక్షతన జగనన్న సురక్ష గ్రామసభ నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన ఎంపీపీ జొన్నకూటి పోసిరాజు 1451 మందికి లబ్ధిదారులకు వివిధ రకాల ధ్రువపత్రాలను అందజేశారు. కార్యక్రమలో జెడ్పీ వైస్ చైర్‌పర్సన్ పోసిన శ్రీలేఖ, ఎంపీపీ జొన్నకూటి పోసిరాజు, ఏఎంసీ చైర్మన్ చైర్మన్ వల్లభశెట్టి శ్రీనివాస్, ఎంపీటీసీ సభ్యురాలు అందుగుల పాప, పార్టీ మండలశాఖ అధ్యక్షుడు కాకర్ల వెంకటేశ్వరరావు, నాయకులు వల్లభశెట్టి చిన్ని, పోసిన శ్రీకృష్ణ దేవరాయలు, ఎంపీడీఓ రమణ, డిప్యూటీ తహసీల్దార్ అహ్మద్ తదితరులు పాల్గొన్నారు.

గ్రంథాలయ ఉద్యమ నేతకు నివాళి

చాగల్లు: గ్రంథాలయ ఉద్యమ పితామహుడు అయ్యంకి వెంకటరమణయ్య జయంతిని సోమవారం మండలంలోని చంద్రవరం శాఖా గ్రంథాలయంలో నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రంథాలయాధికారి కె.సుమన్‌కుమార్ మాట్లాడుతూ గ్రంథాలయాల పునరుద్ధరణకు అయ్యంకి సాగించిన కృషిని కొనియాడారు. ఈ సందర్భంగా ఆయన సేవలను పలువురు స్మరించుకున్నారు. ఆయన చిత్ర పటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు.కార్యక్రమంలో నిడదవోలు సత్యనారాయణ, కె.ఇస్సాక్, ఉపాధ్యాయులు రాధాకృష్ణ, రీడర్స్ ఫోరం సభ్యులు పాల్గొన్నారు.

జాషువాకు నివాళి

కొవ్వూరు: ప్రముఖ కవి గుర్రం జాషువా వర్ధంతి సందర్భంగా పట్టణంలో ఆర్డీవో కార్యాలయ సమీపంలో డివైడర్‌పై ఉన్న ఆయన విగ్రహానికి ఆర్డీవో ఎస్.మల్లిబాబు, ఇతర నాయకులు పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. జాషువా కవితల గొప్పదనాన్ని గురించి వక్తలు వివరించారు. పెనుమాక జయరాజు, బొంతా శ్యాంరవి ప్రకాష్ తదితరలు పాల్గొన్నారు.

విద్యాకానుకల పంపిణీ

గోపాలపురం: రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి విద్యపై ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నారని వేళ్లచింతలగూడెం పంచాయతీ పరిధిలోని పెద్దాపురం ప్రాథమిక పాఠశాలలో సోమవారం విద్యార్థులకు జగనన్న విద్యా కానుకలు పంపిణీ చేశారు.ఆ పంచాయతీ సర్పంచ్ గోళ్ల కుమార్ చేతులమీదుగా వాటిని విద్యార్థులకు అందజేశారు. ద్వారకా తిరుమల దేవస్థానం పాలకమండలి సభ్యుడు తానింకి గంగరాజు, హెచ్ఎం చిన్నం రామయ్య, జగతా శ్రీను, సీఆర్పీ కొయ్య నాగరాజు పాల్గొన్నారు.

27న విద్యుత్తు వినియోగదారుల పరిష్కార వేదిక

నల్లజర్ల: ఈనెల 27న విద్యుత్తు వినియోగదారుల సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్టు ట్రాన్స్‌కో నిడదవోలు ఈఈ బి.వీరభద్రరావు సోమవారం తెలిపారు. నల్లజర్లలోని విద్యుత్తు శాఖ ఏడీఏ కార్యాలయంలో ఉదయం 10-30 గంటలకు నిర్వహించే ఈ కార్యక్రమానికి ఫోరం చైర్మన్, రిటైర్డు న్యాయవాది బి.సత్యనారాయణ .అధ్యక్షత వహిస్తారు. ఈ సదస్సులో వినియోగదారులు తమ సమస్యలను చర్చించవచ్చని వీరభద్రరావు చెప్పారు.

సారాతో మహిళ అరెస్టు

కొవ్వూరు: తాళ్లపూడి మండలం గజ్జరంలో సారా విక్ర యిస్తున్న శీలబోయిన నాగలక్ష్మి అనే మహిళను సోమ వారం అరెస్టు చేసినట్టు ఎస్ఈబీ ఇన్‌స్పెక్టర్ వీటీవీ సత్యనారాయణ తెలిపారు. ఆమె వద్ద ఐదు లీటర్ల సారా స్వాధీనం చేసుకున్నామన్నారు. ఎస్సై జి.బసంతి, సిబ్బంది దాడుల్లో పాల్గొన్నారని తెలిపారు.



కొవ్వొత్తులతో మణిపూర్ మృతులకు నివాళి

నిడదవోలు: మణిపూర్ జరిగిన నగ్నంగా గిరిజన మహిళల ఊరేగింపు, మైనార్టీ క్రైస్తవులపై దాడులు, చర్చిల విధ్వంసం వంటి ఘటనలను ఖండిస్తూ సోమవారం నిడదవోలు పట్టణంలో నిరసన తెలిపారు. యూటీఎఫ్, సీఐటీయూ, కేవీపీఎస్ ఆధ్వర్యంలో స్థానిక చర్చిపేటలోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహం వద్ద వారీ కార్యక్రమం నిర్వహించారు. కొవ్వొత్తులు వెలిగించి మణిపూర్ హత్యాకాండలో మృతులకు శ్రద్ధాంజలి ఘటించారు. ఈ సందర్భంగా కేవీపీఎస్ రాష్ట్ర కమిటీ సభ్యులు జువ్వల రాంబాబు మాట్లాడుతూ మణిపూర్ మారణహోమానికి సంఘ్ పరివార్, హిందూ ఉన్మాదులు, ప్రధాని మోదీ విధానాలే కారణమన్నారు. గిరిజన మహిళలను నగ్నంగా ఊరేగించడంతో పాటు అత్యాచారం, హత్యకు ఒడిగట్టిన దారుణ సంఘటనలకు బాధ్యత వహిస్తూ మణిపూర్ సీఎం భైరిసింగ్, కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్‌షాలు రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. యూటీఎఫ్ నాయకులు ప్రదీప్ మాట్లాడుతూ లౌకిక ప్రజాస్వామ్యంగా వర్ధిల్లుతున్న భారత్‌లో మతం ముసుగులో జరుగుతున్న హింస, మహిళలను నగ్నంగా ఊరేగించిన దుర్మార్గులను కఠినంగా శిక్షించాలన్నారు.కార్యక్రమంలో గంటి కృష్ణ, డొంకా రమేష్, గుమ్మాపు దానియేలు, జి. ఆనంద్‌మోహన్, జి.శివ కుమార్, కె. కుమార్, కె. సత్యనారాయణ, జి. రమేష్‌బాబు, బి. శ్రీరామ్, జి. రాజు, పి. రాజేశ్వరి, శ్రావణి, గంగారత్నం, కెజ స్వరూపరాణి, జి. ప్రసన్నకృష్ణ, కె. గోపి, టి. నాని పాల్గొన్నారు.



నిడదవోలు అంబేద్కర్ విగ్రహం వద్ద కొవ్వొత్తులు వెలిగించి శ్రద్ధాంజలి ఘటిస్తున్న నాయకులు

మణిపూర్ దోషులను కఠినంగా శిక్షించాలి

నిడదవోలు రూరల్: మణిపూర్ ఘటనల్లో దోషులను కఠినంగా శిక్షించాలని కుల నిర్మూలన పోరాట సమితి (కేఎన్‌పీఎస్) జిల్లా ప్రధాన కార్యదర్శి గెద్దం రవీంద్రబాబు డిమాండ్ చేశారు. సమిశ్రగూడెంలోని బాబూ జగ్జీవన్‌రామ్ విగ్రహం వద్ద సోమవారం కేఎన్‌పీఎస్ నాయకులు నిరసన తెలిపారు. ఈ సందర్భంగా రవీంద్రబాబు మాట్లాడుతూ మణిపూర్ ఘటన అత్యంత హేయమైన చర్య అన్నారు. రెండు నెలలుగా మణిపూర్‌లో చోటు చేసుకుంటున్న అల్లర్లు, మారణహోమాలు, అత్యాచారాలకు అడ్డుకట్ట వేసి, శాంతిని నెలకొల్పే విషయంలో కేంద్ర, ఆ రాష్ట్ర ప్రభుత్వాలు పూర్తిగా వైఫల్యం చెందాయన్నారు. ఈ నిరసనలో కేఎన్‌పీఎస్ నాయకులు ఎం.కుమార్, యు.వెంకట్రావు పాల్గొన్నారు.

దేవరపల్లి: మణిపూర్‌లో గిరిజన మహిళలపై జరిగిన అత్యాచారాలను నిరసిస్తూ సీఐటీయూ ఆధ్వర్యంలో సోమవారం స్థానిక బస్టాండ్ వద్ద నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఈ ఘటనకు పాల్పడిన దోషులను కఠినంగా శిక్షించాలని, మణిపూర్‌లో శాంతిభద్రతలను కాపాడలని నాయకులు డిమాండ్ చేశారు. ఆదివాసీ గిరిజన మహిళలపై జరుగుతున్న దాడులను కేంద్ర ప్రభుత్వం ఆపలేకపోయిందన్నారు. కార్యక్రమంలో సీఐటీయూ మండల గౌరవాధ్యక్షురాలు టీపీ లక్ష్మి, అధ్యక్షుడు ఎస్.భగత్, రైతు సంఘం నాయకుడు ఉండవల్లి కృష్ణారావు, పప్పు వెంకట రామారావు, కె.రత్నాజీ పాల్గొన్నారు.